# వాస్తవం

సోమవారం 01.06.2026

డెయిలీ.కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)



జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం

Red 914/2015

జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా

జర్నలిస్ట్స్ హక్కుల కోసం....

వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...

సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110


## మళ్లీ బెంగళూరుకే ఐపీఎల్ కిరీటం

### ఫైనల్లో గుజరాత్‌పై ఘన విజయం

### సత్తా చాటిన బౌలర్లు,కింగ్ కోహ్లీ



వివరాలు 9లో

బెంగళూరు మరోసారి చాంపియన్ అయింది. టోర్నీ ఆరంభం నుంచే అదరగొడుతూ.. లీగ్ టాపర్‌గా నిలిచిన ఆ జట్టునే ఐపీఎల్ కిరీటం వరించింది. తమ మాదిరిగా రెండో ట్రోఫీ వేటలో ఉన్న మాజీ విజేత గుజరాత్ టైటాన్స్ దాని సొంతగడ్డపై చిత్తు చేసింది. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్ ఫైట్‌లో తమకు మద్దతుగా ఎరుపు వర్ణం జెండాలు, జెర్సీలతో నిండిన నరేంద్ర మోదీ స్టేడియంలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెప్పించిన బెంగళూరు 5 వికెట్ల తేడాతో గుజరాత్‌ను ఓడించి టైటిల్ నిలబెట్టుకుంది. తొలుత రసిఖ్ సలామ్ దార్ (3/27), భువనేశ్వర్ (2/29), హేజిల్‌వుడ్ (2/37) బుల్లెట్లలాంటి బంతులు వేయడంతో గుజరాత్ 20 ఓవర్లలో 155/8 స్కోరు మాత్రమే చేసింది. వాషింగ్టన్ సుందర్ (37 బంతుల్లో 5 ఫోర్లతో 50 నాటౌట్) ఫిఫ్టీతో పోరాడాడు. అనంతరం కింగ్ కోహ్లీ (42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 75 నాటౌట్) ముందుండి నడిపించడంతో చిన్న లక్ష్యాన్ని ఆర్సీబీ 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) రాణించాడు. కోహ్లీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

# సీఎం రేవంత్ చిల్లర మనిషి

## మాటలకు విశ్వసనీయత ఉందా

దమ్ముంటే 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తేనే ఓటు అడుగుతామని చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ విసిరారు. ఏ ఊరికైన వెళ్లదాం.. 13 గంటల కరెంట కూడా రావడం లేదన్నారు.

- పూటకో జెండా పట్టే రేవంత్ రెడ్డికి తన గురించి మాట్లాడే నైతిక హక్కు ఉందా?
- నా పుట్టుక బీఆర్ఎస్.. చివరి వరకు నేను ఇదే పార్టీలో ఉంటా
- పార్టీలు మారే గుణం నీది.. చిల్లర మాటలు మానుకో



## సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు హితవు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు మరోసారి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డి చిల్లర మనిషి అని అభివర్ణించారు. నాలుగు పార్టీలు మారినోడు.. దేవుళ్లపై ఓట్లు వేసి మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డి మాటలకు క్రెడిబిలిటీ ఉందా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. పూటకో జెండా పట్టే రేవంత్ రెడ్డికి తన గురించి మాట్లాడే నైతిక హక్కు ఉందా? అని హరీష్ రావు ప్రశ్నించారు. నా పుట్టుక బీఆర్ఎస్.. చివరి వరకు నేను ఇదే పార్టీలో ఉంటానని ఆయన కుండబద్దలు కొట్టారు. పార్టీలు మారే గుణం నీది.. చిల్లర మాటలు మానుకో అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు హితవు పలికారు.

వివరాలు 8లో

# విజయవాడలో 'పెద్ది' ప్రీ రిలీజ్ ఈవెంట్

## ముఖ్య అతిథిగా పవన్ కల్యాణ్..!



వివరాలు 8లో

# నేడు కుమరంభీం జిల్లాకు సీఎం

### కొత్తగూడలో 25 ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం

### రెండో విడత ఇందిరమ్మ ఇళ్లూ మంజూరు



**ఆసిఫాబాద్ మే 31 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు సోమవారం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. జిల్లాలో సుమారు రూ.112.14 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. కెరిమరి మండలం కొఠారి పంచాయతీ పరిధిలోని కొత్తగూడలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించనున్నారు. కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. అదే వేదిక నుంచి రాష్ట్రంలో రెండో విడత కింద 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నారు. చింతల మానేపల్లి మండలంలోని కౌటాలలో రూ.56.55 కోట్లతో ఏర్పాటు చేయనున్న 132/33 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు, గుడ్లబోరి, కాపువాడ, చింతకుంట, అంకుషాపూర్ ప్రాంతాల్లో నిర్మించే 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పనులకూ సీఎం శంకుస్థాపనలు చేయనున్నారు. వీటితో పాటు రెబ్బెన మండలం నాంబాల్‌లో రూ.6 కోట్లతో ఏర్పాటు చేయబోయే సౌర విద్యుత్తు ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రూ.15 కోట్లతో చేపట్టనున్న తొమ్మిది అభివృద్ధి పనులు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో రూ.18.70 కోట్లతో చేపట్టనున్న 8 అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపనలు చేయనున్నారు. సభ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు నివాసానికి చేరుకొని, అక్కడి నుంచి హైదరాబాద్‌కు బయల్దేరతారు. సభకు లక్ష మందిని తరలించేందుకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# జేబులో కత్తెర, రిబ్బన్‌తో సీఎం తిరుగుతున్నారు

### కేసీఆర్ హయాంలో కట్టిన ఫ్లై ఓవర్లను ఆయన ప్రారంభిస్తున్నారు

### కేటీఆర్ సెటైర్లు

**హైదరాబాద్, మే31 :** సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు డిస్కంలు పెడతామని సీఎం ఎలా అంటున్నారని ప్రశ్నించారు. కంటోన్‌మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి కేటీఆర్ హాజరై మాట్లాడారు. సర్‌పై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.కేసీఆర్ హయాంలో హైదరాబాద్‌లో కరెంట్ పరిస్థితి ఎంత బాగుందో చూశామని కేటీఆర్ తెలిపారు. దేశ చరిత్రలో రైతులకు 24గంటల కరెంట్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని వ్యాఖ్యానించారు. కేంద్రంలో కాంగ్రెస్‌ను ఓడిస్తే... తెలంగాణలో మాత్రం తెచ్చుకొని నెత్తిన పెట్టుకున్నారని.. ఇప్పుడు అనుభవిస్తున్నారని చెప్పారు. కంటోన్‌మెంట్ ఉపఎన్నిక సమయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 6వేల ఇళ్లు కడతామని చెప్పారని అన్నారు. రాష్ట్రంలో 6వేల ఇళ్లు కాదు కదా... కనీసం 6 ఇళ్లు కూడా కట్టలేని పరిస్థితి ఉందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టామని ప్రస్తావించారు. రెండున్నరేళ్లలో ఒక్క ఇల్లు అయినా కట్టారా..? అని ప్రశ్నించారు. అవి కడితే చూపించాలని సవాల్ చేశారు. జేబులో కత్తెర, రిబ్బన పెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డి తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో కట్టిన ఫ్లై ఓవర్లను.. ఆయన ప్రారంభిస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ సెటైర్లు గుప్పించారు.



# వేములవాడ పట్టణాభివృద్ధికి ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం

### రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

### రోడ్డు వెడల్పు పనులు పరిశీలన

వాస్తవం : వేములవాడ

వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ పట్టణంలో రాజన్న ఆలయం ముందు జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.... రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా వేములవాడ పట్టణ అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యం ఇస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రులు, దేవదాయ శాఖ జిల్లా మంత్రుల సహకారంతో పనులను వేగవంతం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాజన్న ఆలయంలో సుమారు రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా ఆలయం ముందు నుంచి బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. నిర్వాసితులు, దుకాణదారులు, పట్టణ పెద్దలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ పనులు ముందుకు సాగుతున్నాయని వెల్లడించారు. ఈ రోడ్డుకు సంబంధించి సుమారు రూ.6.50 కోట్ల అంచనా వ్యయంతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయనీ, కాంట్రాక్టర్ త్వరితగతిన పనులు పూర్తి చేసి అప్పగిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరితగతిన తారు రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలో బ్యూటిఫికేషన్ పనుల కోసం రూ.2.60 కోట్లతో చర్యలు తీసుకున్నామని, సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వనమహోత్సవం



సందర్భంగా రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే అన్నదాన సత్రం పనులు రూ.35 కోట్లతో కొనసాగుతున్నాయని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భీమేశ్వర ఆలయాన్ని రూ.6 కోట్లతో ఆధునికరించినట్లు తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధి పూర్తయ్యే వరకు భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. బద్ది పోచమ్మ ఆలయం వద్ద కూడా పనులు వేగంగా జరుగుతున్నాయని, అక్కడి నిర్వాసితులకు సెటర్లు ఏర్పాటు చేసే పనులు త్వరలో పూర్తవుతాయని తెలిపారు. వేములవాడను ఆలయ అభివృద్ధితో పాటు పట్టణ సౌందర్యీకరణ, మౌలిక వసతుల పరంగా మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మాజీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు కొండా శేఖర్, అన్నారపు శ్రీనివాస్, కొక్కుల బాలకృష్ణ , తోటరాజు, నాయకులు కూరగాయల కొమురయ్య, సాగరం వెంకటస్వామి, సిరిగిరి శ్రీకాంత్, నాగరాజు ,తోట లహరి, పులి రాంబాబు, అనిల్, నాగుల విష్ణు, తదితరులు పాల్గొన్నారు..

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## నిర్వహించిన 1995-96 పది విద్యార్థులు

వాస్తవం : రామగుండం రూరల్

పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం రామగుండం పట్టణంలోని ఏ పవర్ హౌస్ వద్దగల రామగుండం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామగుండం ఆవరణ ఆదివారం నాడు అపురూపమైన వేడుకకు వేదికైంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం 1995-1996 విద్యాసంవత్సరంలో ఇక్కడ పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులంతా ఒకే చోట చేరి, ఆత్మీయ సమ్మేళనం పేరిట ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రాంతాలు వేరైనా, వృత్తులు వేరైనా చిన్ననాటి స్నేహమే పరమావధిగా ఒకరి పిలుపుతో మరొకరు కదిలివచ్చిన నాటి మిత్రులు, సుదూర ప్రాంతాల నుండి సైతం ఈ వేడుకకు తరలివచ్చారు. భావోద్వేగాల మధ్య గురువందనం ?ఈ కార్యక్రమానికి నాటి ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి, జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎంతో కాలం తర్వాత తమ విద్యార్థులంతా బాధ్యతాయుతమైన పౌరులుగా సమాజంలో స్థిరపడి, మళ్లీ ఇలా కలిసి గౌరవించడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాల నెమరువేత?ఒకరినొకరు కౌగిలించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ స్నేహితులు సందడి చేశారు. క్లాస్‌రూమ్ ముచ్చట్లు, ఆటపాటలు, పరీక్షల నాటి టెన్షన్లు, ఆనాటి అల్లరి పనులను గుర్తుచేసుకుంటూ మురిసిపోయారు. వయసు మళ్లినా, ఆ కాసేపు అందరూ మళ్లీ పాఠశాల నాటి బాల్య వయసులోకి వెళ్ళిపోయి ఆనందోత్సాహాల మధ్య గడిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చే



సిన ఫోటో సెషన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల అభివృద్ధికి ప్రణాళికలు కేవలం సరదాగా కలవడమే కాకుండా, తాము చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకునేందుకు పూర్వ విద్యార్థులు ఒక మంచి నిర్ణయాన్ని తీసుకున్నారు. రాబోయే రోజుల్లో పాఠశాల మౌలిక వసతుల కల్పనకు, అలాగే ప్రస్తుతం చదువుకుంటున్న పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తమ వంతుగా ఆర్థిక సాయం, సహాయ సహకారాలు అందించనున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు. చివరిగా సహపంక్తి భోజనాలతో, మళ్లీ త్వరలోనే కలుసుకోవాలనే ఆకాంక్షతో, మధురమైన జ్ఞాపకాలను మూటగట్టుకుని పూర్వ విద్యార్థులుతిరుగుపయనమయ్యారు. ఈ కార్యక్రమంలో 1995-96 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు,తూండ్ల శ్రీనివాస్ పటేల్, ఉప్పరి లక్ష్మణ్,మంతెన శ్రీకాంత్,ముదారి శ్రీనివాస్, దావు మురళి మోహన్,దేగల తిరుపతి, ఓదెల రాజమొగిలి,సాదిక్ పాషా ,మల్లేష్, భాస్కర్, గంగారాం, బ్రహ్మము, సలీమ్, సుజాత, సునీత, ప్రసన్న లక్ష్మి, విజయ లక్ష్మి, ప్రభావతి, పద్మ ,వారి కుటుంబ సభ్యులు, పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం

### ఎంఈఓ జి. కృష్ణ హరి



వాస్తవం : ఎల్లారెడ్డిపేట

ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీ ర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోం దని ఎల్లారెడ్డిపేట మండల విద్యాధికారి (ఎంఈఓ) జి. కృష్ణ హరి తెలిపారు. చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట, తిమ్మాపూర్ అగ్రహారం గ్రామాల్లో ఇప్పటికే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్య అమలులో ఉండగా, 2026--27 విద్యా సంవత్సరానికి మరో ఆరు గ్రామాల్లో ఈ సౌకర్యాన్ని ప్రభుత్వం విస్తరించినట్లు తెలిపారు. బొప్పాపూర్, కిషన్‌దాస్‌పేట, నారాయణపూర్, బండలింగంపల్లి, దుమాల, వెంకటాపూర్ గ్రామాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నాలుగు సంవత్సరాలు నిండిన పిల్లలకు ప్రీ-ప్రైమరీ (నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ) విద్యను అందించేందుకు అనుమతులు మంజూరైనట్లు వెల్లడించారు. జూన్ 12 నుంచి తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యం లో, ఆయా గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉచిత ప్రీ-ప్రైమరీ విద్యా సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఎంఈఓ జి. కృష్ణ హరి కోరారు.

# పంట వ్యర్థాలను తగలబెట్టవద్దు



ఎల్లారెడ్డిపేట ఎస్సై. కె .రాహుల్ రెడ్డి

వాస్తవం : ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల గ్రామాలలో నిర్లక్ష్యపు నిప్పుతో ప్రాణాలకు, ఆస్తులకు ప్రమాదం.పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల భూమిలోని సారవంతమైన నేలలు దెబ్బతినడమే కాకుండా, పంటకు మేలు చేసే బ్యాక్టీరియా నశిస్తుందని,ఈ మేరకు ఎల్లారెడ్డి పేట మండల ప్రజలకు, రైతులకు యస్ ఐ. స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ఈ నిప్పు వల్ల ఇతర రైతుల పొలాలు, విద్యుత్ మోటర్లు, స్టార్టర్లు, పైపులైన్లు కాలిపోవడమే కాకుండా, ప్రాణనష్టం జరిగితే సంబంధిత వ్యక్తులపై నాన్-బెయిలబుల్ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల వెంకటాపూర్,బొప్పాపూర్, బండలింగంపల్లి, ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో వరి పొలంలో గడ్డికి నిప్పు పెట్టడం వలన కొంత నష్టం జరిగిందని తెలిపినారు. కావున, రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యర్థాలను తగలబెట్టకుండా, వాటికి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ఎస్సై కోరారు.

# ఘనంగా 2010-2011 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

### 15 వసంతాల తర్వాత ఒకే వేదికపైకి చేరిన స్నేహబంధం
### గురువులకు ఘన సన్మానం, చిన్ననాటి జ్ఞాపకాల నెమరువేత




వాస్తవం : వర్ధన్నపేట

వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లి క్రాస్ దగ్గర ఉన్న విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో 2010--2011 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ స మ్మేళనం ఆదివారం పాఠశాల ప్రాంగణంలో అత్యంత ఘ నంగా మరియు భావోద్వేగభరితంగా జరిగింది. పాఠశాల విద్య పూర్తి చేసుకుని 15 వసంతాలు పూర్తయిన సందర్భంగా మిత్రులందరూ ఒకే చోట చేరారు.గురువులకు పాదాభివందనం.. ఘన సన్మానం ఈ వేడుకలో భాగంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి, జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, జ్ఞాపికలతో సత్కరించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. కళ్లెదుట కదిలిన చిన్ననాటి జ్ఞాపకాలు సుదీర్ఘ కాలం తర్వాత ఒకరినొకరు కలుసుకున్న చిన్ననాటి మిత్రులు ఆలింగనం చేసుకుని ఆనందబాష్పాలు రాల్చారు. తాము చదువుకున్న తరగతి గదులు, ఆడుకున్న ఆట స్థలం, పాఠశాల ప్రాంగణాన్ని చూస్తూ పాత స్మృతులను నెమరువేసుకున్నారు. నాటి రోజుల్లో చేసిన అల్లరి, స్కూల్ జ్ఞాపకాలను పంచుకుంటూ కాసేపు మురిసిపోయారు. ఫోటోలతో కూడిన హిస్టరీ బోర్డులు అందరినీ ఆకట్టుకున్నాయి. "ఈ పాఠశాల కేవలం చదువు నేర్పిన చోటు మాత్రమే కాదు.. మా జీవితాలకు బలమైన పునాది వేసిన దేవాలయం" అని పలువురు పూర్వ విద్యార్థులు భావోద్వేగంతో ప్రసంగించారు.స్నేహ విందు.. భవిష్యత్ కార్యాచరణ సన్మాన కార్యక్రమం అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఒకరి క్షేమసమాచారాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. ప్రతి సంవత్సరం ఇలాగే ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకోవాలని, పాఠశాల అభివృద్ధికి అలాగే తోటి మిత్రులకు అవసరమైన సాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుండాలని తీర్మానించారు.ఈ మధురమైన వేడుకలో పాఠశాల విశ్రాంత, ప్రస్తుత ఉపాధ్యాయులు, దేశ విదేశాల్లో, వివిధ రంగాల్లో స్థిరపడిన 2010-2011 బ్యాచ్ పూర్వ విద్యార్థులు (మహిళలు, పురుషులు) పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గ్రామ సమస్యలపై మంత్రులకు వినతి

### పలు సమస్యలను తెలియజేసిన సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి



వాస్తవం : రామగిరి

ఆదివారం రామగిరి మండలం సెంటనరీ కాలనీలో రాష్ట్ర మంత్రులను కలిసిన కల్వచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.కల్వచర్ల గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్ ల దృష్టికి తీసుకెళ్లారు.ఇటీవల రోడ్డు విస్తరణ పనుల సందర్భంగా గ్రామ బస్టాండ్ తొలగించబడిందని, దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే నూతన బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే ఇటీవల ప్రమాదవశాత్తు గ్రామ పరిసర ప్రాంతాల్లో సుమారు 500 ఈత,తాటి చెట్లు అగ్నికి ఆహుతి కావడంతో గీత కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు.బాధిత కార్మికులకు తగిన నష్టపరిహారం అందజేయడంతో పాటు,హరితహారం కార్యక్రమంలో భాగంగా కొత్త మొక్కలను నాటేలా చర్యలు చేపట్టాలని మంత్రులను కోరారు.అదేవిధంగా రాష్ట్ర రవాణా శాఖ ద్వారా కల్వచర్ల, కమాన్ పూర్,జూలపల్లి,సెంటనరీ కాలనీ మార్గంలో సర్క్యూట్ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్లు సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి తెలిపారు.

# మాల సంఘం నూతన పదవునియమాకం



వాస్తవం : గోదావరిఖని

స్థానిక గోదావరిఖని ప్రధాన చౌరస్తా మాల సంఘం రామగుండంలో నూతన పదవుల నియమాకం కార్యక్రమం నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు మాలెం మధు , కార్పొరేషన్ అధ్యక్షులు సోగ్గాల వెంకన్న చేతులమీదుగా నియామక పత్రాలను అందజేయడం జరిగింది. సట్టు ఉదయ్ కుమార్‌ను మాలసంఘం యూత్ వింగ్ ఉపాధ్యక్షులుగా నియమించడం జరిగింది.అంతేకాకుండా సొల్లు సాగర్ మరియు కోడి వికాస్‌లను యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీగా , కనుమల సంపత్‌ని మాల సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు కొండ సురేష్ న ందినరేష్ నందినాగేష్, అందుగుల లింగయ్య, నూకల మొండి , సంకే సదానందం ,నూశెట్టి యుగేందర్, దాసరి రమేష్ పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



వాస్తవం : మాడుగులపల్లి

మండల కేంద్రంలో గ్రామపంచాయతీ భవనంలో ఆదివారం మాడుగులపల్లి మరియు దాచారం గ్రామాలకు చెందిన ఆరుగురికి వివిధ కారణాలతో ప్రైవేట్ హాస్పటల్లో చికిత్స చేయించుకొని స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా రాష్ట్ర రోడ్డు భవనాల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో మంజూరైనటువంటి రెండు లక్షల ముప్పై ఆరు వేల రూపాయల చెక్కులను మాడుగులపల్లి సర్పంచ్ ఆర్రూరి నరేష్ మరియు దాచారం సర్పంచ్ బెల్లి జానయ్య లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాడుగులపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ఎరుకల వెంకన్న, కట్ట సిద్ధార్థ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## లారీ బైకు ఢీ..మహిళ మృతి



వాస్తవం : అందోల్

లారీ బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన అందోల్ మండలం కన్సాన్పల్లి గ్రామ శివార్లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం అల్లాదుర్గం మండలం మాందాపురం గ్రామానికి చెందిన పాముల స్రవంతి 20, తన బావ సాయి తో పరీక్ష రా యాడానికి బాచుపల్లి వెళ్తున్న క్రమంలో కంసాన్పల్లి గ్రామ శివార్లో రాజస్థాన్ కు చెందిన లారీ అతివేగంగా వచ్చి వెనక నుండి బైకును ఢీకొనడంతో బైక్ పై వెళుతున్న కింద పడిపోయారు వెనకాల కూర్చున్న స్రవంతి తలపై నుంచి లారీ టైర్ వెళ్లడంతో తల నుజ్జు నుజ్జు అయింది ఆమె అక్కడికక్కడే చనిపోయింది. డ్రైవింగ్ చేస్తున్న సాయికి గాయాలు కావడంతో ఆతన్ని ఆసుపత్రికి తరలించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ తరలించారు లారీ డ్రైవర్ను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జోగిపేట పోలీసులు తెలిపారు.

## ముగిసిన వేసవి శిక్షణ శిబిరం




వాస్తవం : ముప్కాల్

మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో మే 1వ తేదీన ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం 31 ఆదివారం రోజుతో ముగిసింది. కార్యక్రమంలో భాగంగా చివరి రోజు పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. ప్రదర్శించిన వాటిలో పేపరు వర్క్, పెయింటింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మిగితా సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు సైతం నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సర్పంచ్ మహేష్ యాదవ్, పాఠశాల చైర్మన్ రాకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

# హెల్త్ కార్డుల కోసం జీతంలో కోత విధించడం సరికాదు

## ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలి లేనిచో ఉద్యమం తప్పదు టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దుమాల రమనాథ్ రెడ్డి హెచ్చరిక

వాస్తవం : సిరిసిల్ల

ఆరోగ్య కార్డులకు సంబంధించి అధికారికంగా ఎలాంటి కార్డులు జారీ కాకుండా నే ముందస్తుగానే ఆర్థిక శాఖ మే నెల జీతం లో కోతలు విధించడం తీవ్రంగా ఆక్షేపిస్తున్నట్లు టిపిటిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దుమాల రామనాద్ రెడ్డి తెలిపారు.ఇంతవరకు ఆర్థిక శాఖ విధివిధానాలను ప్రకటించకుండానే ఏ హాస్పిటల్స్ ఈ యొక్క స్కీం కింద వర్తిస్తాయో తెలుపకుండానే... ఎలాంటి వ్యాధులకు సంబంధించి చికిత్సలు చేస్తారో తెలుపకుండానే..ముందస్తుగా ఉద్యోగుల నుంచిఎలాంటి అనుమతులు లేకుండానే కోతలు విధించారు. . దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రమనాద్ రెడ్డితెలిపారు. సిరిసిల్లలో ఆదివారం రమనాద్ రెడ్డి మాట్లాడుతూ...ఆరోగ్య శాఖ సంబంధించిన వెబ్సైట్లో ఉద్యోగుల వివరాలు కూడా పూర్తిగా నమోదు కాలేదని ఈరోజు వరకు నమోదు చేయడానికి అవకాశం ప్రభుత్వం ఇచ్చిందని ఇంతవరకు పూర్తిగా నమోదు కాకుండానే ఏ విధంగా కోత విధిస్తారని ప్రశ్నించారు.భార్యాభర్తలు ఉద్యోగులైన పక్షంలో ఏ విధంగా నమోదు చేసుకోవాలో ఇంతవరకు ఎలాంటి పూర్తిస్థాయి వివరణ అందుబాటులో ఉంచలేదని అదేవిధంగా నిన్నటి వరకు కూడా వెబ్సైట్లో చాలా మార్పులు చేస్తున్నారని ఇంకా పూర్తిస్థాయి మార్పులు కూడా చేయాల్సిన అవసరం ఉందని అధికారులు తెలియజేస్తున్న తరుణంలో చడి చప్పుడు లేకుండా జీతంలో కోత విధించడం అన్యాయమని వారు చెప్పారు.ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ద్వారా అభిప్రాయాలను సేకరించి ఆరోగ్య కార్డుల జారీలో మార్గదర్శకాలు తయారు చేసి విడుదల చేయాలని, ప్రత్యేకంగా ఎవరైతే ఈ పథకంలో చేరడానికి ఆసక్తి చూపుతారో వారికే కోత విధించాలని ఇష్టం లేని వారికి కోత విధించకుండా నిబంధనలు తయారు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తనకు తానుగా ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించి రక్షణ తీసుకోవాల్సిన బాధ్యత నుంచి తప్పించుకునే క్రమంలో ఒక కొత్త విధానానికి శ్రీకారం చుడుతూ ఉద్యోగుల నుంచి ప్రీమియం చెల్లింపును కోరింది.. అయినా కొన్ని సంఘాలు ఆ విధానానికి ఒప్పుకోలేదు.అయినా ప్రభుత్వం ఆరోగ్య కార్డులు జారీకి సిద్ధమైంది కానీ అందరూ ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు కొరకు కోత విధించడం అన్యాయమని ఉద్యోగుల దగ్గర ఆప్షన్ తీసుకొని మాత్రమే కోతలు విధించాలని డిమాండ్ చేస్తున్నామని వారు తెలిపారు.అంతేకాకుండా ఇప్పుడునెల జీతం లో ముందస్తుగానే కోత విధించారనీ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని విధించిన కోతను మళ్ళీ రేపు జీతంలో కలిపి చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమం చేయడానికి సిద్ధమవుతున్నామని తెలిపారు.



# నిరుపేద ముస్లిం బాలుర కోసం ఉచిత ఖత్నా క్యాంప్



వాస్తవం : గోదావరిఖని

రామగుండం నియోజకవర్గం గోదావరిఖని స్థానిక లక్ష్మీ నగర్ జామా మసీద్ పార్కింగ్ గ్రౌండ్ లో ఆదివారం ఉచిత ఖత్నా క్యాంప్ నిర్వహించిన తంజీమ్ అహలె సున్నత్ వాల్ జమాత్ అధ్యక్షుడు షేక్ హాజీ అలీ.. మాట్లాడుతూ... రామగుండం నియోజకవర్గం లో నిరుపేద ముస్లిం బాలుర కోసం ఉచిత ఖత్నా క్యాంప్ నిర్వహించడం జరిగింది పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని హాజీ అలీ చెప్పారు ఈ క్యాంపు లో సుమారు 100 మందికి పైగా బాలురులకు 30 సంవత్సరాల అనుభవం గల వైద్యుడు షేక్ ముస్తఫా పర్యవేక్షణలో ఉచిత ఖత్నా చేశారు అనంతరం అవసరమైన మందులు సంరక్షణ సామాగ్రి పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో తంజీమ్ అహలె సున్నత్ వాల్ జమాత్ జనరల్ సెక్రటరీ మీర్ జాకీర్ అలీ ఉపాధ్యక్షులు సయ్యద్ జానీ షేక్ యాకూబ్ హసన్ చిష్టి ఆర్గనైజేషన్ సెక్రెటరీ సయ్యద్ ఖాదర్ అలీ కోశాధికారి షేక్ హుస్సేన్ బాజీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జాకీర్ హుస్సేన్ జామా మస్జిద్ అధ్యక్షులు మొహమ్మద్ రబ్బాని మొహమ్మద్ ఫసి ఉద్దీన్ నూరాని మజీద్ అధ్యక్షుడు మీర్జా రియాజ్ మక్కా మసీద్ అధ్యక్షులు షేక్ అలీ జంజం మజీద్ సదర్ సర్దార్ సిరాజుద్దీన్ మీరు ఫయాజ్ నయీమ్ ఆటో షఫీ సయ్యద్ గౌస్ తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు మద్దతు ధరలు అమలు చెయ్యాలి

## తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్

వాస్తవం : మోత్కూర్

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వరి మద్దతు ధరను తక్షణమే ఉపసంహరించుకొని, స్వామినాదన్ కమిషన్ చేసిన సిఫారసుల మేరకు పంటలకు మద్దతు ధర ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం రోజున మోత్కూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రతులను దగ్ధం చేశారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ..తెలంగాణలో ఒక కోటి 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు పండిస్తే కేంద్ర ప్రభుత్వం కేవలం 53 లక్షలు మాత్రమే కొనుగోలు చేస్తామనడం, ప్రైవేట్ దళారి దోపిడీని ప్రోత్సహించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరియైన కొనుగోలు వ్యవస్థ లేకపోవడం వల్ల నష్టపోతున్నారని అన్నారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం ఎరువుల



ఫర్టిలైజర్ల ధరలు పెంచి, మరోవైపు పంటలకు నామమాత్రపు మద్దతు ధర ప్రకటించడం దారుణమని అన్నారు.స్వామినాదన్ కమిషన్ సిఫారసుల మేరకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే వరి దాన్యానికి క్వింటాలుకు 3500 మద్దతు ధర ప్రకటించాలని, లేనిచో రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులను ఐక్యంచేసి కేంద్ర ప్రభుత్వం పై పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి దడిపల్లి ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొల్లు యాదగిరి, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు, కురిమేటి యాదయ్య, పానుగుల రమేష్, పిట్టల చంద్రయ్య, కందుకూరి నర్సింహా, పాల్గొన్నారు.

# కొనసాగుతున్న వీవోఏల నిరవధిక సమ్మె



వాస్తవం : ముస్యాల్

తెలంగాణ ఐకేపీ వీవోఏ ఎంప్లాయిస్ అసోసియేషన్ నిరవధిక సమ్మె ఏడోవ రోజుకు చేరుకుంది. ఆదివారం రోజు మండల అభివృద్ధి కార్యాలయం ముందు సమ్మె కొనసాగింది. సమ్మెలో భాగంగా ఐకేపీ వీవోఏల అధ్యక్షురాలు లోహిత మాట్లాడుతూ సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీసం వేతనం రూ.26 వేలు అందజేయాలని కోరారు. సాధారణ, ఆరోగ్య భీమా రూ.20 లక్షల రూపాయల వరకు వర్తింపజేయాలని, అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు లోహిత, కార్యదర్శి రాధిక, కోశాధికారి విజయ, మండలంలోని ఆయా గ్రామాల వీవోఏలు తదితరులు పాల్గొన్నారు..

# బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయిన చంద్రంపేట విద్యార్థులు

వాస్తవం : సిరిసిల్ల

బాసర ట్రిపుల్ ఐటీకి సిరిసిల్ల అర్బన్ చంద్రంపేట హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు కైరి పద్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వెలువడిన ఫలితాల్లో చంద్రంపేట ఉన్నత పాఠశాలకు చెందిన ఒగ్గు అక్షయ,ఒగ్గు అఖిల,నర్మెట్ట మనస్విని ఉత్తమ మార్కులు రావడంతో వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో ఒగ్గు అక్షయ 569,ఒగ్గు అఖిల 566,నర్మెట్ట మనస్విని 559




మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు.ఇందులో ఒగ్గు అక్షయ,ఒగ్గు అఖిల కవలలు కావడం విశేషం. చంద్రంపేట గ్రామం నుండి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ కంది సుజాత, ఉపాధ్యాయ బృందం కొండికొప్పుల రవి, ముంజ రమ,వేముల అంజలి,వి మధుసూదన్, పి అనిల్ కుమార్, యం చక్రపాణి, మిరియం, లత, త్రివేణి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల హర్షం వ్యక్తం చేశారు.

# జూన్ 2 ఉద్యమకారుల ర్యాలీ

## విజయవంతం చేయాలని జేఏసీ పిలుపు

వాస్తవం : హుస్నాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటుచేయడాన్ని హుస్నాబాద్ నియోజక వర్గం ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు. కాగా ఆ కమిటీ కేవలం రాజకీయ కమిటీ లాగా ఉండడం వల్ల సమగ్రంగా లేదని, అందులో ఉద్యమ సంస్థల ముఖ్యులను , మేధావులను చేర్చాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ జూన్ 2 న మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం ఇవ్వడానికి నియోజక వర్గం లోని ఉద్యమకారులందరూ రాజకీయ పార్టీలకతీతంగా , ఉద్యమ సంస్థలు, ఉద్యోగ ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థి, యువజన, కర్షక , కార్మిక, జర్నలిస్టుల, వివిధ వృత్తి సంఘాల ఉద్యమకారులు పాల్గొనాలని హుస్నాబాద్ జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మా రెడ్డి పిలుపునిచ్చారు. జేఏసీ కో కన్వీనర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ....ఉద్యమ కమిటీ లో రిటైర్డ్ జడ్జి లేదా ఐఏఎస్, ఐపీఎస్ లను కమిటీ లో సభ్యులుగా చేర్చి విస్తరించ డం ద్వారా సమగ్రంగా ఉంటుందని,కేసులకు సంబంధం లేకుండా నికార్సైన ఉద్యమ కారులను గుర్తించాలని, ఉద్యమకారులకు 250 గజాల ఇండ్ల స్థలాలు,రూ.25 వేల పెన్షన్, ఉచిత విద్య, వైద్యం, ఉచిత ఆర్టీసీ ప్రయాణం అందించాలని, ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన వారికి వయస్సుతో సంబంధం లేకుండా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని తదితర అంశాలను పరిశీలించి అమలు చెయ్యాలని , సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని మంత్రి కి వినతి పత్రం ఇవ్వడానికి అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 2న హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తా నుండి ఉదయం గం. 9 లకు ర్యాలీ ప్రారంభం అయి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వరకు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేకల వీరన్న యాదవ్, మడప ప్రభాకర్ రెడ్డి, కోయడ కొమురయ్య , బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఐలెని మల్లికార్జునరెడ్డి, ఉప్పల వెంకటరమణా రెడ్డి, ఎడబోయిన తిరుపతి రెడ్డి, అన్వర్, గడిపే మల్లేష్, లావుడ్య కిషన్ నాయక్, ఇల్లందుల లక్ష్మణ్ ,భుక్య రమేశ్ నాయక్, పి. రాజ్ కుమార్, బండి పుష్ప, బత్తుల చంద్రమౌళి, మెతుకు కొమురయ్య, ఎం. ప్రభాకర్ రెడ్డి, ఎన్. అజయ్ కుమార్, చింతల రామచంద్రం, జె. యాదగిరి, వినీత్, తదితరులు పాల్గొన్నారు.




# కాటారం గిరిజన గురుకులానికి అరుదైన గౌరవం

వాస్తవం : కాటారం

కాటారం: గిరిజన గురుకుల బాలుర కళాశాల విద్యా, క్రీడా రంగాల్లో సాధించిన విజయాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. హైదరాబాద్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో నిర్వహించిన గురుకుల అకాడమిక్ సక్సెస్ మీట్--2025-26లో కళాశాల ప్రిన్సిపాల్ సోమోజిని సత్కరించారు. ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు ఈ గౌరవం దక్కింది.అలాగే కళాశాల విద్యార్థి ఆర్. నిఖిల్‌రాజ్ మినీ నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి సిల్వర్ మెడల్ సాధించగా, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేష్‌ను రూ.10 వేల నగదు ప్రోత్సాహకం, శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సత్కారాన్ని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి వడ్లూరి లక్ష్మణ్ కుమార్, ట్రైబల్ గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి అందజేశారు. ఈ విజయాలు కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచాయని పేర్కొంటూ ప్రిన్సిపాల్ సోమోజి, కోచ్ మూల వెంకటేష్‌లకు కళాశాల టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది హృదయపూర్వక అభినందనలు తెలిపారు.







# వరిధాన్యం కొనుగోళ్లలో మరింత వేగం పెంచాలి

## అపరెల్ పార్క్, గోదాముల్లో అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలి

## లోడింగ్ పరిశీలన రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

వాస్తవం : రాజన్న సిరిసిల్ల ప్రతినిధి

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోళ్లలో మరింత వేగం పెంచాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.వరి ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్, వాహనాలు, ఇతర అంశాలపై సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపరెల్ పార్క్ లో పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సహకార శాఖ, మెప్మా, రవాణా శాఖ, కార్మిక శాఖ అధికారులు, జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అపరెల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ ను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పరిశీలించారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, హమాలీల సంఖ్య, గన్ని సంచులు, ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు మూసి వేశారు.. తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.... కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన గన్ని సంచులు ముందస్తుగా తెప్పించాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని తెలిపారు. కొనుగోళ్లు తుది దశకు చేరిన కేంద్రాల నుంచి హమాలీలు, వాహనాలను ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. ధాన్యం తరలించేందుకు ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు, తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.ఈసమావేశంలో డీఆర్ డీఓ లక్ష్మీనారాయణ, సహకార శాఖ అధికారి రామకృష్ణ, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, తహసీల్దార్ మహేష్,తదితరులు పాల్గొన్నారు.



# అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న మహిపాల్ రెడ్డి



మహిపాల్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన నాయకులు

వాస్తవం : మహబూబాబాద్

తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్కుల మహిపాల్ రెడ్డి ఇటీవల అమెరికాలో తన కూతురు చదువు పూర్తి చేసుకొని డిగ్రీ పట్టా పొందిన సందర్భంగా ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన అమెరికాలోని కొన్ని ప్రదేశాలను పర్యటించారు.తిరిగి శనివారం రాత్రి స్వదేశానికి చేరుకున్నారు.హైదరాబాద్ లోని శంషాబాద్ ఎయిర్పోర్టులో ఆయన అడుగుపెట్టగానే గజ్వేల్,మెదక్ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చి మహిపాల్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మల్కాజ్గిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు ఆదివారం మహిపాల్ రెడ్డికి స్వాగతం చెబుతూ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కావేరి వెంకటరెడ్డి,జావిద్ పాషా,ధర్మేంద్ర ముదిరాజ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు,కార్యకర్తలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రిబుల్ ఐటీకి ఎంపిక మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని



వాస్తవం: మోత్కూర్

శనివారం విడుదల చేసిన ట్రిబుల్ ఐటీ ప్రవేశ ఫలితాల లో మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కొక్కు ల ఉషశ్రీ ట్రిబుల్ ఐటీ బాసరకు ఎంపిక కావడం అభినం దనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అర విందరాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉషశ్రీ 564 మార్కులతో మండలం లోని ప్రథమ ర్యాంకు సాధించి ప్రభుత్వ పాఠశాల ప్రతిష్టను పెంచిందని అన్నారు. భవిష్య త్తులో ఇంకా ఉన్నత స్థానాలు పొంది సమాజాభివృద్ధిలో త న వంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.ఈ విజయం పాఠశాల ఉపాధ్యాయుల పని తీరుకు నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేశారు.

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190
జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Regd.No. 914/2015
JSS
Journalists Sankshema Sangam
JOURNALISTS SANKSHEMA SANGAM
TELANGANA ANDHRAPRADESH
TRADE UNION

మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

# మానసిక సమస్యలకు టెలి మానస్ భరోసా

## సైక్రియాటిస్ట్ జవహర్లాల్ నెహ్రూ

వాస్తవం : రాజేంద్రనగర్
మానసిక సమస్యలకు టెలి మానస్ భరోసా కల్పిస్తూ 24 గంటలు సేవలు అందిస్తుందని ఆ సంస్థ సూపర్వైజర్, ప్రముఖ సైక్రియాటిస్ట్ జవహర్లాల్ నెహ్రూ తెలిపారు.అహం సూత్ర సోషల్ ల్యాబ్, స్పార్క్ కమ్యూనిటీ హెల్త్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రాజేంద్రనగర్ పెద్ద తాళ్లకుంట పార్కులో మానసిక ఆరోగ్యం పై కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సైక్రియాటిస్ట్ జవహర్లాల్ నెహ్రూ, నేషనల్ హెల్త్ మిషన్ అధికారి ప్రముఖ సైకాలజిస్ట్ పాతనేని హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి భరోసా ఇవ్వడానికి టెలి మానస్ పేరిట హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మానసిక సమస్యలపై సలహాలు, సూచనలు, స్వాంతన పొందాలనుకునేవారు తమ హెల్ప్ లైన్ 14416 నెంబర్ పై ఎప్పుడైనా సంప్రదించవచ్చని సూచించారు. సమాజంలో రోజురోజుకు మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం కింద ప్రతి రాష్ట్రంలో టెలి మానస్ హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ



హెల్ప్ లైన్ సెంటర్ 24 గంటలు పనిచేస్తుందని వెల్లడించారు. వాస్తవానికి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల విపరీత వినియోగం వల్ల మానసిక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అంతేకాకుండా ఇతర సామాజిక సమస్యలు కూడా చవి చూడవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ ఫోన్లను కానీ ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ కానీ మన అవసరం మేరకే వాడుకోవాలని సూచించారు. విపరీతమైన వాడకం వల్ల ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక విశ్లేషకులు ప్రొఫెసర్ కనకయ్య, మల్లికార్జున్ రెడ్డి, పెద్ద తాళ్లకుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంగయ్య, దుర్గా దాస్, అహం సూత్ర సోషల్ ల్యాబ్ వ్యవస్థాపకులు రాచూరి అజిత్, సామాజిక కార్యకర్త జర్నలిస్టు మ్యాదం మధు, తదితరులు పాల్గొన్నారు.

# ఉట్లపల్లి పోచమ్మ ఆలయంలో భక్తుల సందడి



వాస్తవం : కాటారం
కాటారం మండలం గుండ్రాత్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఉట్లపల్లి పోచమ్మ ఆలయం ఆదివారం భక్తుల రాకతో సందడిగా మారింది. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందడం ఆనవాయితీగా భావించే భక్తులు వివిధ గ్రామాలు, ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోగా, మహిళలు, పురుషులు, చిన్నారులు కుటుంబ సమేతంగా అమ్మవారి దర్శనం చేసుకున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కోళ్లు, మేకలు సమర్పించడంతో పాటు సంప్రదాయం ప్రకారం సురాపానకాలతో అమ్మవారిని కొలిచారు.భక్తుల రద్దీతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. దర్శనం అనంతరం భక్తులు కుటుంబ సౌఖ్యం, మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఉట్లపల్లి పోచమ్మ ఆలయంలో భక్తుల సందడి నెలకొనడంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

# తిరుమలగిరి మండల స్వర్ణకారుల సంఘం ఎన్నికకు ఆహ్వానం

వాస్తవం : తిరుమలగిరి
తిరుమలగిరి మండల స్వర్ణకార అధ్యక్షులు మారోజు ఈశ్వరాచరీ అధ్యక్షతన మండల కేంద్రంలో ని పెన్షనర్స్ భవనంలో స్థానిక స్వర్ణ కారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూర్యాపేట జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు తొగిటి మురళి హాజరై మాట్లాడుతూ జూన్ 14 వ తారీఖున తిరుమలగిరి స్వర్ణ కారుల సంఘం కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఇట్టి ఎన్నికల్లో మండల పరిధిలోని స్వర్ణకారులందరు పాల్గొనవలసినదిగా కోరారు. ఈసందర్భంగా ఎన్నికల నిర్వహణ కోసం ఆహ్వానకమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా మాచర్ల మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి పోలోజు విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు కందుకూరు కాంతయ్య చారి, కోశాధికారి చోళ్ళేటి నర్సింహా చారి లను నియ



మించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ సలహాదారు నారాయణదాసు రామాచారి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాణాల శ్రీనివాస్, సభ్యులు తొల్లోజు శ్రీనివాస్ చారి, కత్తురోజు లక్ష్మణ చారి, మాచర్ల నాగచారి, పెద్దోట ఉదయ్ లు పాల్గొన్నారు.

# చందుర్తి పురగిరి క్షత్రియ సంఘం అధ్యక్షులుగా మర్రి కృష్ణ



వాస్తవం : చందుర్తి
చందుర్తి మండల కేంద్రంలో పురగిరి క్షత్రియ సంఘం అధ్యక్షులుగా మర్రి కృష్ణ ఎన్నికయ్యారు. పురగిరి క్షత్రియ సంఘంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా మర్రి కృష్ణ తో పాటు డైరెక్టర్ లను ఎంపిక చేశారు. మర్రి కృష్ణ ఎంపిక పట్ల సర్వత్రా అభినందనలు తెలిపారు.

# ఎర్రసైన్యానికి... రెడ్ సెల్యూట్

## సిపిఎం కు అరుణ్ కుమార్ రాజీనామా

## పార్టీ పెద్దల, పార్టీ శ్రేణుల ప్రజల ఆధారణకు ధన్యవాదములు

వాస్తవం : వీర్నపల్లి
మండలనికి చెందిన మల్లారపు అరుణ్ కుమార్ సిపిఎం పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు 18 సంవత్సరాల నుండి విద్యార్థి ఉద్యమ నాయకుడుగా ప్రస్థానము ప్రారంభించి కార్మిక ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని తనదైన ముద్ర వేసుకున్నారు,మారుమూల ప్రాంతం నుండి రాష్ట్ర స్థాయి వరకు అంచేంచెలుగా ఎదుగడు సిపిఎం లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గా కీలకంగా పని చేశారు 2019లో భారీ మెజార్టీ తో ఎంపీటీసీ గా గెలిచారు ఎంపీటీసీ గా కూడ ప్రజలా గొంతుకై నిలిచారు 2026లో మండల కేంద్రంలో సర్పంచ్ గా



తన భార్య జ్యోత్స్న ను నిలపెట్టి గెలిపించుకున్నారు 18 సంవత్సరాలు పాటు అలుపెరుగని పోరాటాలు చేసిన అరుణ్ ఎర్ర జెండా విప్లవ ఉద్యమానికి గుడ్ బై చెప్పారు

# అంతిమ యాత్రలో రాష్ట్ర ప్రభుత్వ విప్



వాస్తవం : రుద్రంగి
రుద్రంగి మండల కేంద్రంలో రుద్రంగి మాజీ సర్పంచ్ కీర్తిశేషులు చెలుకల గంగ రాజయ్య సతీమణి చెలుకల బుచ్చవ్వ మృతి చెందగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదివారం పార్థివదేహానికి నివాళులు అర్పించి వారి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.కుటుంబీకులకు ఆది శ్రీనివాస్ ఓదార్పు కల్పించారు.ఈ కార్యక్రమంలో కోనరావుపేట మండలం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, చందుర్తి, రుద్రంగి కాంగ్రెస్ పార్టీ మండల శాఖల అధ్యక్షులు గొట్టె ప్రభాకర్,ఎర్రం గంగ నర్సయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుల బంధువులు పాల్గొన్నారు.

# ఎర్ర బ్యాడ్జీలతో డ్యూటీలకు వెళ్ళిన ఆర్టీసీ కార్మికులు

వాస్తవం : హుస్నాబాద్
హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులు ఆదివారం తెల్లవారుజామున గం. 5 నుండి ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. జూన్ 2 న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి అప్పాయింటెడ్ డేట్ ప్రకటించాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో జేఏసీ నాయకులు సుధాకర్ రెడ్డి, వి



ఆర్ ఎం రెడ్డి, చారి, రాజు, సురేష్, పవన్ మరియు మహిళ కార్మికులు పాల్గొన్నారు.

# అపురూపం ఆత్మీయ సమ్మేళనం

## ఉత్సాహంగా గడిపిన 20 బ్యాచుల విద్యార్థులు




వాస్తవం : హుస్నాబాద్

1996 నుండి 2016 బ్యాచ్ లకు చెందిన పూర్వ హుస్నాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హుస్నాబాద్ పట్టణంలోని తిరుమల గార్డెన్ లో ఉత్సాహభరితంగా ఘనంగా నిర్వహించారు. 20 బ్యాచులకు చెందిన విద్యార్థులు ఆటపాటలతో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు కరతాల ధ్వనులతో పూలు వెదజల్లి స్వాగతం పలికారు. ఈ అపురూపమైన స్వాగతంతో ఉపాధ్యాయులు సంతోషించి పోయారు. దాదాపు 70 మంది ఉపాధ్యాయులు 600 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. 20 బ్యాచ్ లకు చెందిన విద్యార్థులు అందరూ ఒకే చోట కలుసుకోవడంతో ఆప్యాయతగా పలకరించుకోవడం, యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం, స్థిరపడ్డ రంగాల గురించి మాట్లాడుకోవడం వంటి విషయాలతో ఆదివారాన్ని ఆనందంగా గడిపారు. కాగా గురుకులంలో చదువుకున్న విద్యార్థులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, వ్యాపారవేత్తలుగా, కానిస్టేబుళ్లు, లాయర్లు, ఎస్సైలు, సిఐలు, సిఆర్పిఎఫ్ జవాన్ లుగా మరెన్నో రంగాల్లో స్థిరపడంతో ఆశాంతం కార్యక్రమం అందర్నీ ఆకట్టుకుంది. హుస్నాబాద్ గురుకుల పూర్వ విద్యార్థి ప్రస్తుత గచ్చిబౌలి సీఐ కన్నం మధు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.... సంక్షేమ సంక్షేమ గురుకుల పాఠశాలలు బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపాయని, కాబట్టి ప్రభుత్వం అందించే విద్యా అవకాశాలు వినియోగించుకొని తమ జీవితాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. తన జీవితంలో మర్చిపోని అనుభూతిని హుస్నాబాద్ లో చదవడం మూలంగానే తాను సమాజంలో గొప్ప వ్యక్తిగా ఎదిగానని అన్నారు. మరో గురుకుల పూర్వ విద్యార్థి ప్రస్తుత న్యాయవాది జే.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.... 20 సంవత్సరాల తర్వాత తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా గురుకుల  పాఠశాల విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రభుత్వ అధికారులుగా  ఉండడం సంతోషకరమని అన్నారు. మరి ఎంతోమంది గురుకుల పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను ఈ కార్యక్రమాల ద్వారా పంచుకున్నారు. అలాగే సీఐ. రమేష్ ఎస్సైలు అంజయ్య,రాజు ప్రొగ్రాం నిర్వాహకులు వేల్పుల కుమార్ ఇ. నరేష్. ఉపాధ్యాయులు పి. డి. శ్రీనివాస్ లక్ష్మి కాంతారావు  శివ ప్రసాద్ సత్తయ్య, సత్యనారాయణ రెడ్డి, విద్యార్థులు మంద శ్రీనివాస్ వేల్పుల మహేందర్ లంబ లక్సమాన్, కన్నూరి సురేందర్,చిరంజీవి, పొన్నాల వినోద్, అశోక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



వాస్తవం : వేములవాడ

వేములవాడ ఆర్టీసీ డిపో ఎదుట ఆదివారం ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. తమకు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో జాప్యం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్య వైఖరి కొనసాగుతోందని ఆరోపిస్తూ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హామీల అమలులో పురోగతి లేకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలో నిరసనలు, సమ్మెకు దిగుతామని ఉద్యోగులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిరిసిల్ల,వేములవాడ ఆర్టీసీ ఉద్యోగుల జేఏసీ నాయకులు,ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పీఎం మన్ కీ బాత్ వీక్షించిన బిజెపి నాయకులు



వాస్తవం : రాజేంద్రనగర్

రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్దేవ్పల్లి కాటేదాన్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ ను వీక్షించిన నియోజకవర్గ ఇన్చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి, స్థానిక బిజెపి నాయకులు. ఆదివారం డివిజన్ అధ్యక్షుడు గోదా పాండు యాదవ్ ఆధ్వర్యంలో సంతు గౌడ్ నివాసంలో నాయకులతో కలిసి 134వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని శ్రీనివాస్ రెడ్డి వీక్షించారు. 352, 353, 354 బూత్ నంబర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బి. నరసింహ, రమేష్ రెడ్డి, శంకర్ రెడ్డి, రామారావు, శేఖర్, గురుస్వామి, కిరణ్, రాజలింగం, రమేష్ యాదవ్, విజయ్, డివిజన్ నాయకులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ముక్కోణపు సిరీస్

## భారత్-ఎ జట్టు వైస్ కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్

శ్రీలంకలో ముక్కోణపు సిరీస్‌కు భారత్-ఎ జట్టు వైస్ కెప్టెన్‌గా యువ బ్యాటర్ రియాన్ పరాగ్ ఎంపికైన సంగతి తెలిసిందే. తాజాగా తొడ కండరాల గాయంతో పరాగ్ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో అతడి స్థానంలో స్టార్ ప్లేయర్ రుతురాజ్ గైక్వాడ్‌కు బీసీసీఐ చోటు కల్పించింది. దాంతోపాటు వైస్ కెప్టెన్ బాధ్యతలనూ అప్పగించింది. జూన్ 9 నుంచి ప్రారంభం కానున్న ఈ ముక్కోణపు సిరీస్‌లో భారత్-ఎ, శ్రీలంక-ఎ, అఫ్ఘానిస్థాన్-ఎ జట్లు తలపడనున్నాయి. ప్రతి జట్టు మిగతా రెండు జట్లతో రెండేసి మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌లన్నింటికీ శ్రీలంకలోని దంబుల్లా ఆతిథ్యమివ్వనుంది. ఐపీఎల్ 2026లో రియాన్ పరాగ్ రాజస్థాన్ రాయల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. టోర్నీ మొత్తాన్ని అతడు కండరాల గాయంతోనే ఆడాడు. ఇప్పుడు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించడంతో ముక్కోణపు సిరీస్ నుంచి వైదొలిగాడు. పూర్తిగా కోలుకోవడానికి దాదాపు మూడు నెలల సమ యం పట్టే అవకాశం ఉందని సమాచారం.

**భారత్-ఎ జట్టు:**

తిలక్ వర్మ(కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్(వైస్ కెప్టెన్), ప్రియాంశ్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, ఆయుశ్ బదోని, నిశాంత్ సింధు, సుర్యాంశ్ షెడ్గే, ప్రభ్‌సిమ్రన్ సింగ్(వికెట్ కీపర్), కుమార్ కుషాగ్రా(వికెట్ కీపర్), విప్రాజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్వీర్ సింగ్, అన్షుల్ కాంబోజ్, అర్షద్ ఖాన్, అనుకుల్ రాయ్



జర్నలిస్ట్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్టు సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్టు హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190




మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

# విజయవాడలో 'పెద్ది' ప్రీ రిలీజ్ ఈవెంట్..

### ముఖ్య అతిథిగా పవన్ కల్యాణ్..!

**అమరావతి, మే 31,:** గ్లోబల్ స్టార్ కొణిదెల రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం పెద్ది ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు విజయవాడ వేదిక కానుంది. ఈ చిత్రం విడుదలకు ముందు భారీ స్థాయిలో అభిమానులను ఆకట్టుకునేలా ఈ వేడుకను నిర్వహించేందుకు చిత్రబృందం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 'పెద్ది' ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉంది. ఈ వేడుకలో హీరో రామ్ చరణ్‌తో పాటు చిత్రబృందం మొత్తం పాల్గొననుంది. హీరోయిన్ జాన్వీ కపూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఈ కార్యక్రమంలో రామ్ చరణ్ సందడి చేయనుండటంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. ఇప్పటికే విజయవాడ నగరంలో మెగా అభిమానుల సందడి కనిపిస్తోంది. ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచేలా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించేందుకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అభిమానుల కోసం ప్రత్యేక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు కూడా చేపడుతున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కిన 'పెద్ది' సినిమా జూన్ 4వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ మూవీ రిలీజ్‌కు ముందు నిర్వహిస్తున్న ఈ ఈవెంట్ సినిమా ప్రమోషన్లలో కీలక ఘట్టంగా మారనుంది. రామ్ చరణ్, జాన్వీ కపూర్ హాజరుకానుండటంతో పాటు పవన్ కల్యాణ్ కూడా పాల్గొనే అవకాశం ఉండటంతో ఈ కార్యక్రమంపై సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



## సీఎం రేవంత్ చిల్లర మనిషి

**మాటలకు విశ్వసనీయత ఉందా?**
**పూటకో జెండా పట్టే రేవంత్ రెడ్డికి తన గురించి మాట్లాడే నైతిక హక్కు ఉందా?**
**నా పుట్టుక బీఆర్ఎస్.. చివరి వరకు నేను ఇదే పార్టీలో ఉంటా**
**పార్టీలు మారే గుణం నీది.. చిల్లర మాటలు మానుకో**
**సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు హితవు**

**సిద్ధిపేట, మే 31:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు మరోసారి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డి చిల్లర మనిషి అని అభివర్ణించారు. నాలుగు పార్టీలు మారినోడు.. దేవుళ్లపై ఓట్లు వేసి మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డి మాటలకు క్రెడిబిలిటీ ఉందా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. పూటకో జెండా పట్టే రేవంత్ రెడ్డికి తన గురించి మాట్లాడే నైతిక హక్కు ఉందా? అని హరీష్ రావు ప్రశ్నించారు. నా పుట్టుక బీఆర్ఎస్.. చివరి వరకు నేను ఇదే పార్టీలో ఉంటానని ఆయన కుండబద్దలు కొట్టారు. పార్టీలు మారే గుణం నీది.. చిల్లర మాటలు మానుకో అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు హితవు పలికారు. ఆదివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హరీష్ రావు విలేకర్లతో మాట్లాడుతూ.. 24 గంటల ఉచిత విద్యుత్ కోసం ఆర్పిడీసీఎల్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ చెప్పారన్నారు. వాస్తవం వేరు.. సీఎం మాట్లాడేది వేరంటూ ఆయన మండిపడ్డారు. అర్పిడీసీఎల్‌తో 24 గంటల ఉచిత విద్యుత్ రాదన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పాలిట, మిషన్ భగీరథ, డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌లకు అర్పిడీసీఎల్ శాపమని పేర్కొన్నారు. రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తే చాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారని.. శనివారం ఎమ్మెల్సీ కోదండ రెడ్డి అధికారికంగా ఇదే విషయం చెప్పారని గుర్తు చేశారు. తాము ఏది మాట్లాడినా ఆధారాలతో మాట్లాడతామని పేర్కొన్నారు. దమ్ముంటే 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తేనే ఓటు అడుగుతామని చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ విసిరారు. ఏ ఊరికైన వెళ్లదాం.. 13 గంటల కరెంట కూడా రావడం లేదన్నారు. 24 గంటల కరెంట్‌కు సీఎం రేవంత్ రెడ్డి మంగళం పాడుతున్నారని మండిపడ్డారు. మీ బడే బాయి చెప్పింది చేస్తున్నట్లు ఉంది.. గుజరాత్‌లో 8 గంటల కరెంట్ మాత్రమే ఇస్తున్నారని వ్యంగ్యంగా అన్నారు. జీవో నం 8 ప్రకారం అర్పిడీసీఎల్‌కు రెన్యువబుల్ ఎనర్జీ మాత్రమే ఇస్తామంటున్నారన్నారు. రెన్యువబుల్ కరెంట్ అంటే సోలార్ పవర్.. ఇది ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే వస్తుందన్నారు. థర్మల్ పవర్ మాత్రమే కంపెనీలకు పైసలకు ఇస్తారట అంటూ ఆయన వ్యంగ్యంగా అన్నారు. కానీ సోలార్ ఎనర్జీ మాత్రం రైతులకు ఇస్తారట.. అన్ని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలను అర్పిడీసీఎల్ కింద వేస్తామన్నారు. థర్మల్ పవర్ లేకుండా రాత్రుళ్లు కరెంట్ ఎట్లా ఇస్తారని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్‌కు మంచి నీళ్లు రావాలంటే ఎల్లంపల్లి, కృష్ణ, సింగూర్ నుంచి రావాల్సి ఉందని హరీష్ రావు పేర్కొన్నారు. అర్పిడీసీఎల్ పవర్ 7, 8 గంటలు ఇస్తే తాగు నీళ్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అర్పిడీసీఎల్‌తో రైతులను 24 గంటల కరెంటుకు దూరం చేస్తున్నడంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మూడు డిస్కంలతో అనేక సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులతోపాటు ప్రజల మీద భారం పెరుగుతుందన్నారు. టీజీఆర్పిడీసీఎల్ అనేది తుగ్లక్ చర్య అని చెప్పారు. ప్రైవేటైజేషన్ చేయడానికే ఇదంతా కుట్ర చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే దీనిపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ముంబయి, బెంగుళూరు నగరాలు ప్రైవేటైజేషన్ అయిపోయాయన్నారు. దీన్ని వెంటనే విరమించుకోవాలని రేవంత్ సర్కారుకు హరీశ్ రావు సూచించారు. బిఆర్ఎస్ హయంలోనే డిస్కంలకు అప్పులు అయ్యాయని అనడానికి సిగ్గు ఉండాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ రావు చురకలంటించారు. బిఆర్ఎస్ హయాంలో ఏట రూ. రెండు వేల కోట్లు అప్పు అయితే కాంగ్రెస్ హయంలో ఏట రూ.10 వేల కోట్లు అప్పు చేసిందని వివరించారు. ఈ రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ డిస్కంలు చేసిన అప్పు రూ. 25,284 కోట్లుగా ఉందని గణాంకాలతో సహా ఆయన వివరించారు. అర్పిడీసీఎల్.. రైతాంగానికి ఉరి తాడుగా మారనుందని ఆవేదన వ్యక్తం చేశారు. పద్దతి మార్చుకోకుంటే భారీ ప్రజా ఉద్యమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు హెచ్చరించారు.




**ముఖం బాగోలేక అద్దం పగులగొట్టుకున్నట్లుగా రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. కేసీఆర్ తీసుకొచ్చిన అప్పులతో రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేశారో వివరించారు. అలాగే రేవంత్ రెడ్డి అప్పులు తెచ్చి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు.కేసీఆర్ అప్పులతో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టాడని కేటీఆర్ తెలిపారు.**

**హైదరాబాద్ :** ముఖం బాగోలేక అద్దం పగులగొట్టుకున్నట్లుగా రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. కేసీఆర్ తీసుకొచ్చిన అప్పులతో రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేశారో వివరించారు. అలాగే రేవంత్ రెడ్డి అప్పులు తెచ్చి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు.కేసీఆర్ అప్పులతో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టాడని కేటీఆర్ తెలిపారు. రైతుబంధు రూపంలో రూ.73 వేల కోట్లు రైతుల ఖాతాలో వేశాడని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ రూపంలో రెండుసార్లు రూ.30వేల కోట్లు రైతుల ఖాతాలో వేశాడని చెప్పారు. రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టి విద్యుత్ వ్యవస్థను చక్కగా చేసిండని అన్నారు. ఇంటింటికీ నల్లా పెట్టిండు.. ఇంటింటికీ 20వేల నీళ్లు ఇచ్చిండని తెలిపారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ కట్టించాడని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు డాక్టర్లు అయ్యే అవకాశం కల్పించాడని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి 45 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిండని చెప్పారు. అత్యధిక ధాన్యం పండించి దేశానికే బువ్వపెట్టే స్థాయికి తెచ్చాడని తెలిపారు. 45 వేల చెరువులను మిషన్ కాకతీయ కింద బాగు చేసిండని అన్నారు. 15 లక్షల మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మీ కింద కట్నమిచ్చిండని చెప్పారు. 15లక్షల మంది మహిళలకు కేసీఆర్ కిట్లు ఇచ్చిండని అన్నారు. రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2వేలు చేసిండని తెలిపారు.మరి రెండున్నరేళ్లలో 4 లక్షల కోట్ల అప్పు చేసి రేవంత్ రెడ్డి ఏం అభివృద్ధి చేసిండని కేటీఆర్ ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఇచ్చిండా.. వృద్ధులకు రూ.4వేల పింఛన్ ఇచ్చిండా అని నిలదీశారు. ఆడబిడ్డలకు స్కూటీలు లేవు కానీ.. రాష్ట్రంలో లూటీ జరుగుతుందని అన్నారు. నిరుద్యోగ యువతకు 2లక్షల ఉద్యోగాలిస్తానని అన్నాడని.. ఇచ్చాడా అని ప్రశ్నించారు. ఢిల్లీకి పంపించేందుకు రేవంత్ రెడ్డి డబ్బులు బాగానే కూడబెడుతున్నాడని అన్నారు.రైతులకు యూరియా, కరెంట్ ఇచ్చే తెలివి లేదు.. కానీ రైతు డిస్కం పెడతాడట అని మండిపడ్డారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో.. రైతులపై రేవంత్ రెడ్డికి అంతే ప్రేమ ఉంటదని వ్యాఖ్యానించారు. రైతు డిస్కం పేరిట ఉచిత విద్యుత్ ఇస్తానంటే ఎవరు నమ్మరని అన్నారు. ఊళ్లలో కాంగ్రెస్‌ను నమ్మినందుకు గోసపడుతున్నారని తెలిపారు.

వాస్తవం



# మళ్లీ బెంగళూరుకే ఐపీఎల్ కిరీటం

**ఫైనల్లో గుజరాత్‌పై ఘన విజయం సత్తా చాటిన బౌలర్లు,కింగ్ కోహ్లీ**



**అహ్మదాబాద్:** బెంగళూరు మరోసారి చాంపియన్ అయింది. టోర్నీ ఆరంభం నుంచే అదరగొడుతూ.. లీగ్ టాపర్‌గా నిలిచిన ఆ జట్టునే ఐపీఎల్ కిరీటం వరించింది. తమ మాదిరిగా రెండో ట్రోఫీ వేటలో ఉన్న మాజీ విజేత గుజరాత్ టైటాన్స్ దాని సొంతగడ్డపై చిత్తు చేసింది. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్ ఫైట్‌లో తమకు మద్దతుగా ఎరుపు వర్ణం జెండాలు, జెర్సీలతో నిండిన నరేంద్ర మోదీ స్టేడియంలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెప్పించిన బెంగళూరు 5 వికెట్ల తేడాతో గుజరాత్‌ను ఓడించి టైటిల్ నిలబెట్టుకుంది. తొలుత రసిఖ్ సలామ్ దార్ (3/27), భువనేశ్వర్ (2/29), హేజిల్‌వుడ్ (2/37) బుల్లెట్లలాంటి బంతులు వేయడంతో గుజరాత్ 20 ఓవర్లలో 155/8 స్కోరు మాత్రమే చేసింది. వాషింగ్టన్ సుందర్ (37 బంతుల్లో 5 ఫోర్లతో 50 నాటౌట్) ఫిఫ్టీతో పోరాడాడు. అనంతరం కింగ్ కోహ్లీ (42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 75 నాటౌట్) ముందుండి నడిపించడంతో చిన్న లక్ష్యాన్ని ఆర్సీబీ 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) రాణించాడు. కోహ్లీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

ఆతిథ్య గుజరాత్ బ్యాటింగ్‌కు గుండెకాయలాంటి ఓపెనర్లను ఆరంభంలోనే వెనక్కుపంపిన ఆర్సీబీ బౌలర్లు ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేయడంలో సక్సెస్ అయ్యారు. టాస్ నెగ్గి బౌలింగ్ ఎంచుకున్న కెప్టెన్ పాటిదార్ నిర్ణయానికి పూర్తి న్యాయం చేశారు. రెడ్, బ్లాక్ సాయిల్‌తో కూడిన పిచ్‌ను అర్థం చేసుకొని సరైన లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేశారు. మూడో ఓవర్లో హేజిల్‌వుడ్ 141 కి.మీ వేగంతో సంధించిన షార్ట్ పిచ్ బాల్‌ను కెప్టెన్ గిల్ (10) పుల్ షాట్ ఆడబోయి పాటిదార్‌కు చిక్కగా.. తర్వాతి ఓవర్లోనే భువనేశ్వర్ బౌన్సర్‌ను వెంటాడిన సుదర్శన్ (12) కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు 26 పరుగులకే డగౌట్ చేరిన తర్వాత టైటాన్స్ పుంజుకోలేకపోయింది. వన్‌డౌన్‌లో వచ్చిన నిశాంత్ (20).. హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు, రసిఖ్ బౌలింగ్‌లో ఓ బౌండరీతో పవర్ ప్లేను 45/2తో ముగించాడు. కానీ, ఫీల్డింగ్ మారిన తర్వాత స్పిన్నర్ కృనాల్, పేసర్లు రసిఖ్, డఫీ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. వరుసగా ఆరు ఓవర్లలో ఒక్క బౌండరీ కూడా ఇవ్వలేదు. రసిఖ్ వేసిన ఎనిమిదో ఓవర్లో భారీ షాట్‌కు ట్రై చేసిన నిశాంత్.. లైన్ వద్ద పడిక్కల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.

ఈ దశలో సుందర్ ఇన్నింగ్స్‌ను సరిచేసే బాధ్యత తీసుకోగా.. బంతితో పరుగు కూడా చేయలేకపోతున్న బట్లర్ (19)ను కృనాల్ స్టంపౌట్ చేయడంతో గుజరాత్ 73/4తో మరింత డీలా పడింది. కొత్తగా క్రీజులోకి వచ్చిన అర్షద్ ఖాన్ (15) రెండు సిక్సర్లు, సుందర్ రెండు ఫోర్లు కొట్టి ఇన్నింగ్స్‌కు చలనం తెచ్చే ప్రయత్నం చేశారు. కానీ, ఆర్సీబీ బౌలర్లు అస్సలు తగ్గలేదు. 15వ ఓవర్లో రసిఖ్ పట్టిన క్యాచ్‌తో అర్షద్‌ను హేజిల్‌వుడ్ ఔట్ చేయగా.. హిట్టర్ తెవాటియా (7) నిరాశపరిచాడు. అయితే, చివర్లో సుందర్ విలువైన రన్స్ అందించాడు. హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో అతను రెండు ఫోర్లు, హోల్డర్ (7) ఓ బౌండరీ రాబట్టడంతో 16 పరుగులు వచ్చాయి. చివరి ఓవర్లో సిక్స్ కొట్టిన రషీద్ ఖాన్ (7) వెంటనే ఔటైనా ఆఖరి బాల్‌కు సింగిల్ తీసిన సుందర్ ఫిఫ్టీ పూర్తి చేసుకొని జట్టుకు గౌరవప్రద స్కోరు అందించాడు.

బౌలర్లు ప్రత్యర్థిని తక్కువ స్కోరుకు కట్టడి చేసిన పిచ్‌పై కింగ్ కోహ్లీ బ్యాట్‌తో చెలరేగడంతో ఛేదనలోనూ ఆర్సీబీ హవానే నడిచింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన వెంకటేశ్ ఉన్నది కొద్దిసేపే అయినా ఫుల్ ఇంపాక్ట్ చూపెట్టాడు. తొలి ఓవర్లోనే కాలి కండరాలు పట్టేయడంతో కుంటుతూ కనిపించిన వెంకీ.. భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. రబాడ వేసిన రెండో ఓవర్లో మూడు ఫోర్లు, సిక్స్‌తో 18 రన్స్ పిండుకున్నాడు. మరో ఎండ్‌లో కోహ్లీ తన మార్కు స్టయిలిష్ షాట్లతో అలరించాడు. సిరాజ్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు రాబట్టిన అతను రబాడ వేసిన నాలుగో ఓవర్లో 4, 4, 6,4తో స్టేడియాన్ని హోరెత్తించాడు. సిరాజ్ బౌలింగ్‌లో ఓ సిక్స్ కొట్టిన వెంకీ ఇంకో షాట్‌కు ట్రై చేసి క్యాచ్ ఇవ్వడంతో తొలి వికెట్‌కు 62 రన్స్ భాగస్వామ్యం ముగిసింది.

వన్‌డౌన్‌లో వచ్చిన పడిక్కల్ (1)ను రబాడ వెంటనే ఔట్ చేసినా ఆరో ఓవర్ చివరి బాల్‌కు సిక్స్ కొట్టిన కోహ్లీ పవర్ ప్లేను 70/2తో ముగించాడు. కెప్టెన్ రజత్ పాటిదార్ (15) ఓ సిక్స్, ఫోర్‌తో దూకుడు చూపడంతో ఆర్సీబీ ఈజీగా గెలిచేలా కనిపించింది. కానీ, తొమ్మిదో ఓవర్లో బౌలింగ్‌కు దిగిన స్పిన్నర్ రషీద్ నాలుగు బంతుల తేడాలో పాటిదార్‌ను బౌల్డ్, కృనాల్ పాండ్యా (2)ను ఎల్బీ చేసి జీటీ శిబిరంలో ఆశలు రేపాడు. కానీ, అప్పటికే క్రీజులో కుదురుకున్న కోహ్లీ ప్రత్యర్థికి ఎలాంటి చాన్స్ ఇవ్వలేదు. 25 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్న విరాట్.. టిమ్ డేవిడ్ (24) తోడుగా లక్ష్యాన్ని కరిగించాడు. మూడు ఫోర్లు, ఓ సిక్స్ కొట్టిన డేవిడ్ గెలుపు ముంగిట వెనుదిరిగినా.. జితేశ్ (11నాటౌట్) తోడుగా కోహ్లీ లాంఛనం పూర్తి చేశాడు. అర్షద్ బౌలింగ్‌లో వరుసగా ఫోర్, సిక్స్‌తో మ్యాచ్ ముగించడంతో ఆర్సీబీ సంబరాలు మొదలయ్యాయి.

3 ఐపీఎల్‌లో వరుసగా రెండోసారి విజేతగా నిలిచిన మూడో టీమ్ ఆర్సీబీ. గతంలో చెన్నై(2010, 11), ముంబై(2019, 20) ఈ ఘనత సాధించాయి.

3 ఐపీఎల్‌లో వరుసగా రెండోసారి టైటిల్ గెలిచిన మూడో కెప్టెన్‌గా రజత్ పాటిదార్. ధోనీ(చెన్నై), రోహిత్‌శర్మ(ముంబై) ముందున్నారు.

2 ఐపీఎల్ ఫైనల్లో తక్కువ(25) బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన రెండో బ్యాటర్ కోహ్లీ. రైనా, వార్నర్, వెంకటేశ్ అయ్యర్ (24 బంతుల్లో) ముందంజలో ఉన్నారు.

8 గత ఎనిమిది ఐపీఎల్ సీజన్లలో క్వాలిఫయర్-1లో గెలిచిన జట్టే టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది.

1 ఒక సీజన్‌లో ఒకే టీమ్‌లో ఇద్దరు బ్యాటర్లు 700కు పైగా పరుగులు చేయడం ఇదే తొలిసారి. గుజరాత్ ఓపెనర్లు గిల్(732), సాయి సుదర్శన్(722) ఈ ఫీట్ సాధించారు.

ప్రైజ్‌మనీ
ఆర్సీబీ రూ.20

జీటీ రూ.12.5 కోట్లు

## బ్యాటింగ్, బౌలింగ్‌లో సమతూకం

ప్రత్యర్థులను బ్యాటింగ్‌తోనే పూర్తిగా అధిగమించేలా ఆర్సీబీ ఒక భయానక బ్యాటింగ్ విభాగాన్ని నిర్మించింది. హై-రిస్క్, హై-రివార్డ్ విధానాన్ని నమ్ముకుంటూ ప్రతి మ్యాచ్‌లోనూ 200కు పైగా పరుగులు సాధించేలా ప్రణాళికలు రచించింది. బ్యాటింగ్‌లో కోహ్లీతో పాటు టిమ్ డేవిడ్, జితేశ్ శర్మ, కృనాల్ పాండ్యాతో కూడిన లైనప్ జట్టుకు భారీ స్కోర్లను అందించింది. దేశవాళీల్లో అదరగొట్టిన యువ స్టార్ దేవదత్ పడిక్కల్ సైతం తన ఫామ్‌ను ఇక్కడా కొనసాగించాడు. గాయాలు లేదా ఆటగాళ్ల లభ్యత లేకపోవడాన్ని తట్టుకునేలా జట్టు బ్యాకప్‌ను బలంగా ఉంచారు. భారీ ధర పెట్టి కొన్న వెంకటేష్ అయ్యర్‌కు, ఫిల్ సాల్ట్ గాయపడితే తప్ప తుది జట్టులో చోటు దక్కలేదంటే జట్టు సమతూకం ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చిన్నస్వామి స్టేడియం లాంటి హై-స్కోరింగ్ మైదానంలో ఆర్సీబీకి బౌలింగ్ ఎప్పుడూ ఒక బలహీనతగా ఉండేది. కానీ గత మెగా వేలంలోనే మేనేజ్‌మెంట్ తెలివిగా వ్యవహరించి పటిష్టమైన బౌలింగ్ విభాగాన్ని నిర్మించింది. భారత్ వెటరన్ పేసర్ భువనేశ్వర్ స్వింగ్, డెత్ ఓవర్ల నైపుణ్యంతో మెరిశాడు. అతనికి జోష్ హేజిల్‌వుడ్ ఖచ్చితత్వం తోడైంది. వీరితో పాటు జాకబ్ డఫీ, దేశవాళీ పేసర్ రసిఖ్ సలామ్ దార్ వైవిధ్యమైన బంతులతో రాణించారు. కృనాల్ పాండ్యా మిడిల్ ఓవర్లలో పరుగులను నియంత్రిస్తూ అత్యంత కీలకమైన డిఫెన్సివ్ బౌలర్‌గా మారగా, సుయాష్ స్పిన్ బలం కూడా తోడైంది. ఆండీ ఫ్లవర్ దూకుడు వ్యూహాలకు, మెంటార్, బ్యాటింగ్ కోచ్‌గా దినేశ్ కార్తీక్ తెరవెనుక చేసిన ప్రణాళికాబద్ధమైన కృషి తోడవడంతో జట్టులో గందరగోళం పోయి స్పష్టత వచ్చింది.